
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 29.3। కనిష్ఠం 10.8

ఆదిలాబాద్
జిల్లా వార్తలు
5
మంగళవారం 26 నవంబరు 2024


జైనథ్‌లో ఆయిల్ ఇంజన్ ద్వారా పంటలకు సాగునీటిని అందిస్తున్న రైతులు


సోయాలను అమ్మకానికి తెచ్చి మార్కెట్ యార్డులో అక్కడే మధ్యాహ్న భోజనం చేస్తున్న రైతులు

సోయా కొనుగోళ్లలో జాప్యం

- గన్నీ బ్యాగులు లేక రైతుల అవస్థలు
- బార్‌కోడ్ వేయకపోవడంతో ఇక్కట్లు
- వారాల తరబడి మార్కెట్ యార్డులోనే అన్నదాతల ఎదురుచూపులు

7


విద్యార్థులతో కలిసి ప్రార్థన చేస్తున్న ఉపాధ్యాయుడు

సార్ మీటింగ్‌కు వెళితే.. ఆ బడికి సెలవే!

- 40 మంది విద్యార్థులకు ఒక్కరే టీచర్
- అధికారుల నిర్లక్ష్యంతో ఉన్నత చదువులకు దూరమవుతున్న గిరిపుత్రులు

7

జైనథ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

- అక్కడికక్కడే ఇద్దరి మృత్యువాత
- మృతుల్లో ఓ చిన్నారి, వృద్ధుడు
- మరొకరికి తీవ్ర గాయాలు

6లో


పిచ్చిమొక్కలు, పూడికతో అధ్వానంగా మారి కనిపిస్తున్న సాత్నాల ప్రాజెక్టు సాగునీటి కాల్వలు

- ప్రాజెక్టుల్లో నీళ్లున్నా.. నిరుపయోగమే
- అధ్వానంగా కనిపిస్తున్న సాగునీటి కాలువలు
- చివరి ఆయకట్టుకు సాగు నీరు అందడం గగనమే..
- యాసంగి పంటల సాగుపై ఆయకట్టు రైతుల్లో ఆందోళన



అన్నదాతల.. ఊగిసలాట

ఆదిలాబాద్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): వానాకాలం పంటల సీజన్ దాదాపుగా ముగిసి పోవడంతో యాసంగి పంటల సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ఈయేడు జిల్లాలో సమృద్ధిగా వర్షాలు కురవడంతో ప్రాజెక్టుల్లో ఆశించినస్థాయిలో నీటి నిల్వలు కనిపిస్తున్నాయి. జిల్లా సాధారణ వర్షపాతం 1086.0 మి.మీ.లు కాగా, నవంబరు 25 వరకు 1114.1 మి.మీ.ల అధిక వర్షపాతం నమోదు అయ్యింది. వానాకాలం సీజన్‌లో వర్షాధార పంటలైన పత్తి, సోయా, కంది పంటలను ఎక్కువగా సాగు చేశారు. యాసంగిలో జిల్లా వ్యాప్తంగా లక్షా 50వేల ఎకరాలలో పంటలను సాగు చేస్తారు. ఇందులో ప్రధానంగా శనగ, మొక్కజొన్న, జొన్న, వేరుశనగ, ఇతర కూరగాయల పంటలను సాగు చేస్తారు. యాసంగి పంటల సాగుకు అక్కడక్కడ బోరుబావులు, చెరువులు, కుంటలు, ప్రాజెక్టుల కింద నీటి లభ్యతను బట్టి వరి, ఇతర పంటలను సాగు చేస్తారు. జిల్లాలో చిన్న నీటి ప్రాజెక్టులున్నా కాలువల నిర్మాణం అంపూర్తిగానే మారడంతో నిరుపయోగంగానే మారి కనిపిస్తున్నాయి. పలు మండలాల్లో చెక్‌డ్యాంల నిర్మాణం పూర్తికావడంతో అందుబాటులో సాగునీరు ఉన్న రైతులు మాత్రం ఆరుతడి పంటలనే సాగు చేస్తున్నారు. ముఖ్యంగా సాత్నాల, మత్తడి వాగు ప్రాజెక్టులతో పాటు చిక్‌మాన్, కరత్వాడ ప్రాజెక్టులు ఉన్నాయి. గత ఎనిమిదేళ్ల క్రితం 50 వేల ఎకరాలకు సాగు నీరందించే ఉద్దేశంతో పెన్‌గంగా నదిపై కోర్టా-చనకా బ్యారేజీ నిర్మాణాన్ని ప్రారంభించారు. దాదాపుగా బ్యారేజీ నిర్మాణం పనులు పూర్తయ్యాయి. కానీ సాగు నీటి కాల్వల పనులు అసంపూర్తిగానే మారడంతో ఆయకట్టుకు సాగునీరు అందడం లేదు. హత్తిఘాట్ పంప్‌హౌజ్ వెట్‌రన్ పూర్తయినా.. ఆయకట్టు సాగు ప్రశ్నార్థకంగానే మారింది. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వమైన జిల్లా సాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేకదృష్టిని సారించాలని రైతులు కోరుతున్నారు.

ఏళ్ల తరబడి మరమ్మతుల కరువు

జిల్లాలో సాగునీటి కాల్వలకు ఏళ్ల తరబడి మరమ్మతులు చేపట్టక పోవడంతో అధ్వానంగా మారి కనిపిస్తున్నాయి. భారీగా పూడిక, పిచ్చిమొక్కలు పెరిగి కాలువల ఆనవాళ్లు కనిపించకుండానే పోతున్నాయి. యేటా వానాకాలం, యాసంగి పంటల సీజన్‌కు ముందు మరమ్మతులు చేపట్టాల్సి ఉన్నా.. అధికారులు పట్టించుకోవడమే లేదని అన్నదాతలు ఆరోపిస్తున్నారు. భారీ వర్షాలకు సాగునీటి కాల్వలకు గండ్లు పడడంతో రైతులే తాత్కాలికంగా మరమ్మతులు చేసుకుంటూ సాగునీటిని తరలిస్తున్నారు. ప్రధానంగా సాత్నాల, మత్తడి వాగు, చిక్‌మన్ ప్రాజెక్ట్, అడెగామా(కె) ప్రాజెక్టులను నిర్మించి దశాబ్దాలు గడుస్తున్నా.. పూర్తిస్థాయిలో ఆయకట్టుకు సాగునీరు అందడం గగనంగానే మారింది. గతంలోనే సిరికొండ మండలం లో చిక్‌మన్ ప్రాజెక్ట్, ఇచ్చోడ మండలంలో అడెగామా(కె) ప్రాజెక్ట్‌ల నిర్మాణ పనులు పూర్తయ్యాయి. అయినా ఇప్పటి వరకు సాగునీటి కాల్వల నిర్మాణం పూర్తికాక పోవడంతో ఆయకట్టుకు సాగునీరు అందడమే లేదు. పిల్ల కాలువలను కూడా నిర్మించకపోవడంతో రైతులు ఆయిల్ ఇంజన్‌ల ద్వారా నీటిని తరలిస్తూ పంటలను సాగు చేస్తున్నారు. జిల్లాలో అన్ని ప్రాజెక్టుల ఆయకట్టు కాల్వల పరిస్థితి అధ్వానంగా మారడంతో యాసంగి పంటల సాగుపై అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు.

ఆశించిన స్థాయిలో నీళ్లు ఉన్నా..

ప్రాజెక్టులు, చెరువులు, కుంటల్లో ఆశించిన స్థాయిలో నీటి నిల్వల ఉన్నా.. నిరుపయోగంగానే మారింది. సాగునీటి కాల్వలు సరిగా లేకపోవడంతో.. నీళ్లున్నా.. అక్కరకు రాకుండానే పోతోంది. ఈసారి చివరి ఆయకట్టుకు సాగునీరు అందడం అనుమానంగానే కనిపిస్తోంది. వానాకాలం సీజన్‌లోనే చివరి ఆయకట్టుకు సాగునీరు అందడం లేదంటూ ఇటీవల జైనథ్ మండలంలో రైతులు రాస్తారోకో చేపట్టి నిరసన తెలిపారు. జిల్లాలో ప్రధాన ప్రాజెక్టులుగా చెప్పుకునే సాత్నాల, మత్తడి వాగు ప్రాజెక్టులు నిండుకుండను తలపిస్తున్నాయి. మత్తడివాగు

(తరువాయి 6వ పేజీలో...)

సగం ఆయకట్టుకే సాగునీరు అందుతుంది

: పి.గణేష్ యాదవ్, రైతు, జైనథ్ మండలం



సాత్నాల ప్రాజెక్టు ద్వారా సగం ఆయకట్టుకే సాగునీరు అందుతోంది. ఇప్పటి వరకు పూర్తిస్థాయి ఆయకట్టుకు సాగునీరు అందించిన దాఖలాలు లేవు. దీని ద్వారా కుడి, ఎడమ కాలువలతో 24 వేల ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉన్నా.. కనీసం 10వేల ఎకరాలకు కూడా అందడం లేదు. యాసంగి పంటలను సాగు చేస్తున్నా.. భయం భయంగానే ఉంది. చివరి వరకు సాగునీరు అందుతుందో? లేదో? అర్థంకాని పరిస్థితి ఉంది. కాల్వలకు మరమ్మతులు చేపట్టి చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. ఏళ్ల తరబడి మరమ్మతులు చేయడం లేదు. ప్రాజెక్టుల్లో నీళ్ల ఉన్నా.. ఏం అక్కరకు రాకుండానే పోతోంది.

సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటాం

: శ్రీనివాస్, డీఈ, ఆదిలాబాద్



సాత్నాల ప్రాజెక్టు చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందేవిధంగా చర్యలు తీసుకుంటాం. ప్రధాన కాల్వల మరమ్మతులను ఎప్పటికప్పుడు చేపడుతున్నాం. పిల్ల కాలువలను నిర్మించేందుకు ఈజీఎస్ నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపించడం జరిగింది. నిధులు మంజూరుకాగానే మరమ్మతులతో పాటు కాలువలను నిర్మిస్తాం. రైతులు యాసంగిలో ఆరుతడి పంటలను వేసుకుంటేనే మంచిది.

మొక్కుబడిగా ప్రజావాణి

- బోసిపోయిన కార్యక్రమం
- అర్జీలను స్వీకరించిన ట్రైనీ కలెక్టర్


మాట్లాడుతున్న ఫౌండేషన్ అధ్యక్షులు రోహిత్ షిండే


మాట్లాడుతున్న ఇచ్చోడ రైతులు

ఆదిలాబాద్ రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : అర్జీదారులు లేక ఆదిలాబాద్ ప్రజావాణి బోసిపోయింది. జిల్లా కలెక్టర్ రాజర్షి షా సెలవులో ఉండడం.. అదనపు కలెక్టర్ సైతం అందుబాటులో లేకపోవడంతో ప్రజావాణి మొక్కుబడిగా సాగింది.

సమస్యలు అడిగి తెలుసుకున్న ట్రైనీ కలెక్టర్..

కలెక్టరేట్ సమావేశమందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ట్రైనీకలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వీయా అర్జీదారుల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యా, వైద్యం, పంచాయతీ, పింఛన్, ఇండస్ట్రీ, ఉపాధి శాఖలకు సంబంధించిన 63 అర్జీలు అందాయి. వాటిని ఆయా శాఖల అధికారులకు అందజేసిన ఆయన వాటిని పరిష్కరించేలా తగుచర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో వినోద్‌కుమార్, జడ్పీ సీఈవో జితేందర్ రెడ్డి, డీఆర్డీవో సాయన్న పాల్గొన్నారు.

● బెదిరింపులకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి..

యువశక్తి ఫౌండేషన్‌పై పలువురు సోషల్ మీడియాలో రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెడుతూ బెదిరింపులకు పాల్పడుతున్నారని ఫౌండేషన్ అధ్యక్షులు రోహిత్ షిండే అన్నారు. దీనిపై సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ అభిజ్ఞాన్ మాలవీయకు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిమ్స్‌ఆస్పత్రి ఆవరణలో స్వచ్ఛందంగా నిత్యం అన్నదానం చేస్తున్న తమ ఫౌండేషన్‌పై లేనిపోని ఆరోపణలు చేస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారని వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సోమ ప్రశాంత్, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ మోటర్లు అందించి న్యాయం చేయాలి..

ఇచ్చోడ మండలంలోని తలమద్రి గ్రామస్తులకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా బోర్లు మంజూరు అయ్యాయని, కానీ మోటర్లు లేవని, మంజూరు చేయాలని వారు కోరారు. ఈ విషయమై సోమవారం ఆదిలాబాద్ ప్రజావాణికి వచ్చి విన్నవించారు. మూడేళ్లక్రితం బోర్లు, కరెంట్ మంజూరు అయిందన్నారు. కానీ మోటర్లు మంజూరు చేయలేదన్నారు. దీంతో పంట పండించుకోవడానికి ఇబ్బంది ఉందని దళిత రైతులు వాపోయారు. విద్యుత్ మోటర్లు మంజూరు చేస్తే రబీ పంట పండించుకుంటామన్నారు. వ్యవసాయంపైనే ఆధారపడి జీవించే తమకు విద్యుత్ మోటర్లను అందించి న్యాయం చేయాలి.

గిరిజనుల అర్జీలు సత్వరమే పరిష్కరించాలి : ఏపీవో

ఉట్నూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : గిరిజన ప్రజల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ఏపీఓ (జనరల్) జాదవ్ వసంతరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమ స్యల అర్జీలను స్వీకరించారు. ఇంద్రవెల్లి మండలం వడగావ్ గ్రామానికి చెందిన విజయలక్ష్మి తనకి ఏదైనా ఉద్యోగం ఇప్పించమని, ఉట్నూర్ మండలం చిన్నూగూడ గ్రామానికి చెందిన దుర్గుబాయి తనకు వృద్ధాప్య పెన్షన్ మంజూరు చేయించామని, ఇచ్చోడ మండలం పార్వేట్ గ్రామానికిచెందిన విలాస్ తనకి జిరాక్స్ సెంటర్ కోసం లోన్ కల్పించాలని కోరారు. పింఛన్, రెండు పడకల గదుల ఇండ్లు, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని దరఖాస్తులు సమర్పించారు. వెంటనే చర్యలు తీసు కోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఓ (పీవీ టీజ) మేస్రం మనోహర్, పీహెచ్ఓ సందీప్‌కుమార్, పేసా కో-ఆర్డినేటర్ వసంత రావు పాల్గొన్నారు.

విద్యార్థుల పట్ల జాగ్రత్త అవసరం

● యువరాజ్ మార్మాట్ సబ్‌కలెక్టర్

నార్నూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆశ్రమ పాఠశాల విద్యార్థుల పట్ల అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని, వారికి ఎలాంటి ఇబ్బంది ఉండకుండా చూడాలని ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మట్ ఉపాధ్యాయులను ఆదేశించారు. సోమవారం మండల కేంద్రంలోని ఆశ్రమ ఉన్నత బాలిక పాఠశాల ఆకస్మికంగా పర్యటించి అక్కడి సమస్యలను విద్యార్థులు పభుత్వ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య పరంగా ఎవరికైనా సమస్యలు మెనూ ప్రకారం భోజనం ఇస్తున్నారా చదువు, ఇతరాత్ర సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత అంశాలపై సంతృప్తికరమైన జవాబు చెప్పారు. అనంతరం వంట గది స్టోర్‌రూమ్ పాఠశాల రికార్డు తనిఖీ చేశారు. ఎట్టి పరిస్థితుల్లో విద్యార్థుల పట్ల అశ్రద్ధ వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. వారి వెంట అధికారులు ఇన్‌చార్జీ ప్రధాన ఉపాధ్యాయుడు జాదవ్‌వసంత్‌రావు, పీడీ విశ్వనాథ్, ఆడే వార్డెన్ పవర్ వనిత, సిబ్బంది ఉన్నారు.

టీకాల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలి :డీఎంహెచ్‌వో



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్

ఆదిలాబాద్ రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పిల్లలకు అందించే వ్యాధి నిరోధక టీకాల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని డీఎంహెచ్ఓ రాథోడ్ నరేందర్ సూచించారు. జిల్లాలోని వైద్య అధికారులు, ప్రజారోగ్య సిబ్బందికి ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని డీఎంహెచ్ఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ సమయాను సారంగా టీకాలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ సాధన, డీఐఓ వైసీ శ్రీనివాస్, డబ్ల్యూహెచ్ఓ ప్రతినిధులు అతుల్, మురారి తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి : ఎమ్మెల్యే


అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బొజ్జుపటేల్

ఉట్నూర్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి నిర్మాణ పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. సోమవారం ఉట్నూర్ మండలంలోని సుద్దగూడ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న వంతెన పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పేదల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకమైన సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. అభివృద్ధి పనుల విషయంలో నాణ్యత ప్రమాణాలు లోపించకుండా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ ఉండాలని పేర్కొన్నారు. వంతెన నిర్మాణ పనుల వివరాలు అధికారితో మాట్లాడి తెలుసుకున్నారు. త్వరితగతిన పనులు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో అధికారులు శివప్రసాద్, ఇందల్‌రాథోడ్, భుజంగ్‌రావు తదితరులున్నారు.

తుకారం వర్ధంతి సభను జయప్రదం చేయండి

ఈ నెల 29న ఉట్నూర్ మండలంలోని లక్సెట్టిపేటలో తొలి ఆదివాసీ ఐఏఎస్ అధికారి మడావి తుకారం 26వ వర్ధంతి సభను విజయవంతం చేయాలని ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మబొజ్జుపటేల్ పిలుపునిచ్చారు. సోమవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వర్ధంతి సభకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్వహణ కమిటీ వర్ధంతి సభకు రావాలని ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ప్రాంత ఆదివాసీ ప్రజల కోసం మడావి తుకారం ఎనలేని సేవలందించారని అన్నారు. మడావి తుకారం స్మారకార్థం వాలీబాల్ పోటీలను సైతం నిర్వహించడం జరుగుతుందని, యువ కులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవా లన్నారు. కార్యక్రమంలో మడావి తుకారం వర్ధంతి సభ నిర్వహణ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏఎంసీ డైరెక్టర్ రాధాబాయి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఖయ్యూం తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ ఉద్యమకారుడికి నివాళి


గుడిహత్నూర్‌లో నివాళులర్పిస్తున్న ఆదివాసీ సేన నాయకులు

గుడిహత్నూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అనారోగ్యంతో మరణించిన ఆదివాసీ ఉద్యమకారుడు తుడుం దెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉయిక సంజీవ్‌కు ఆదివాసీ సేన ఆధ్వర్యంలోసోమవారం మండల కేంద్రలో నివాళులర్పించారు. అయన చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సేన జిల్లా అధ్యక్షుడు భీరాయిసిడం జంగు పటేల్, ఆదివాసీ సేన ముఖ్య సలహాదారులు ఉయిక లక్ష్మణ్, ఆదివాసీ విద్యార్థి సేన జిల్లా కన్వీనర్ కుంరం చత్రుఘున్, ఆదివాసీ సేన మండల అధ్యక్షుడు సెడ్మకి భీంరావు, నాయకులు వెడ్మ చంతప్‌రావు, తొడసం లక్ష్మణ్, సలాం జాకు, టేకం భీంరావు, మడావి జంగు, కోట్నాక గోవింద్, కుంరం విష్ణు తదితరులు పాల్గొన్నారు.

మావల : ఆదివాసి ఉద్యమ నేత, తుడుం దెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉయిక సంజీవ్ మృతి ఆదివాసీ సమాజానికి తీరని లోటని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణక్క, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డిలు అన్నారు. ఆదివారం ఉదయం ఉయిక సంజీవ్ అనారోగ్యంతో మృతిచెందగా, ఆదివారం రాత్రి బేల మండలం సాంగ్వి(జీ)లోని వారి నివాసానికి వెళ్లి కుటుం బసభ్యులను పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటామని ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు. ఆదివాసీ హక్కుల కోసం వారి సమస్యల పరిష్కారం కోసం ఉయిక సంజీవ్ ఎన్నో ఉద్యమాలు చేశారని, అలాంటి వ్యక్తి మృతిచెందడం బాధాకరమని ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కాంగ్రెస్ నాయకులు, నవీన్‌రెడ్డి, విశాల్‌లున్నారు.

ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కాంట్రాక్ట్ రెండో ఏఎన్ఎంలు

ఆదిలాబాద్ రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : వైద్య ఆరోగ్య శాఖలో పని చేస్తున్న కాంట్రాక్ట్ రెండో ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని వైద్య ఆరోగ్య సంఘాల పోరాట కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ కుమార్ అన్నారు. ఏఎన్ఎంలకు రాత పరీక్ష లేకుండా రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమ లు చేయాలని డిమాండ్ చేశారు. 20 సంవత్సరాలుగా వైద్య ఆరోగ్య శాఖలో సెకండ్ ఏఎన్ఎం, ఈసీఏ, అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఏఎన్ఎంలు విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో కమిటీ నాయకులు ఆనంద, జ్యోతి, సంగీత, విజయలక్ష్మి, దేవుబాయి పాల్గొన్నారు.

శ్యామ్‌పూర్‌లో ప్రజాపాలనపై అవగాహన

ఉట్నూర్, నవంబరు25 (ఆంధ్రజ్యోతి): జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారి ఆధ్వర్యంలో ప్రజాపాలన ప్రజావిజయోత్సవాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. సోమవారం ఉట్నూర్ మండలంలోని షాపూర్‌లో డీపీఆర్ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. తెలంగాణ సాంస్కృతిక సారధి బృందంతో ప్రతి గ్రామంలోని సమగ్ర కుటుంబ సర్వే, ఆరుగ్యారంటీలపై పాటల రూపంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాకారులు ఆత్రం గోవింద్‌రావు, గోడం అశీష్, కుమ్రనగేష్, రాథోడ్‌శంకర్, కొడప దుర్గాత పాల్గొన్నారు.

మండల విద్యాధికారికి సన్మానం

బోథ్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండల విద్యాధికారిగా తనపై మరింత బాధ్యత పెరిగిందని ఎంఈవో కుమ్మరి పోశెట్టి పేర్కొన్నారు. సోమవారం ఆయనను కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో విద్యా వ్యవస్థను మరింత గాడిన పెటాల్సిన బాధ్యత పెరిగిందన్నారు. బాధ్యతగా విధులు నిర్వహించి తాను మండల విద్యా వ్యవస్థ పటిష్ఠం చేస్తామన్నారు. ఎంఈవోను సన్మానించిన వారిలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, కాంగ్రెస్ పార్టీ జిల్లా సోషల్ మీడియా అధ్యక్షులు బత్తుల రమేష్ ఉన్నారు.

అనుమతులు లేని ఇసుక లారీ స్వాధీనం

బోథ్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకతో వచ్చిన లారీని ఆదివారం రాత్రి పట్టుకున్నట్లు బోథ్ ఎస్సై ప్రవీణ్ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం ఇసుక లోడ్‌తో బోథ్‌కు వస్తున్న లారీని ఆపి ఎలాంటి అనుమతులు ఉన్నాయన్న విషయాన్ని అడగడం జరిగిందని ఎస్‌ఐ పేర్కొన్నారు. అయితే లారీ ఈనెల 23న నిర్మల్ జిల్లాలోని భైంసా మండల కేంద్రానికి చేరుకోవాల్సి ఉండగా దొంగ చాటుగా బోథ్‌కు వచ్చిందని అయితే ఈ విషయం తమకు సమాచారం రావడంతో పట్టుకోవడం జరిగిందన్నారు. అనుమతులు లేకుండా వచ్చిన లారీని తహసీల్దార్‌కు అప్పగించామన్నారు.

కుమ్మరి కుంటలో వైద్య శిబిరం

ఉట్నూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాలలో ప్రబలుతున్న వ్యాధులు అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో వచ్చిన వార్తకు ఏజెన్సీ వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కుడి మెత మనోహర్ స్పందించారు. సోమవారం వైద్య సిబ్బందిని వెంటబెట్టుకుని దొంగ చిం త, సోనాపూర్ గ్రామాల మీదుగా కుమ్మరి కుంటకు చేరుకున్నారు. అక్కడ జ్వరం దగ్గు జలుబు లాంటి వ్యాధులతో బాధపడుతున్న ఓ 20 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించినట్లు డాక్టర్ మనోహర్ తెలిపారు. వాతావరణంలో వస్తున్న మార్పు లతో వస్తున్న వ్యాధులకు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు ఎప్పటి కప్పుడు గ్రామాల్లో తిరుగుతూ వైద్య సేవలు అందిస్తున్నారని అన్నారు. ఆయన వెంట హెల్త్ సూపర్‌వైజర్ నాందేవ్, ఏఎన్ఎం ఆశవర్కర్ తదితరులున్నారు.

ప్రభుత్వ నిబంధనల ప్రకారమే స్కానింగ్ : ఆస్పత్రి యాజమాన్యం

ఆదిలాబాద్‌రూరల్, నవంబరు25 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని డయాగ్నోస్టిక్ సెంటర్లలో అంతా ప్రభుత్వ నిబంధనల ప్రకారమే స్కానింగ్‌లు జరుగుతున్నాయని ఆసుపత్రి యజమాన్యం పేర్కొంది. ఆంధ్రజ్యోతిలో "స్కానింగ్ సెంటర్ల పేరిట దోపిడి" అనే వార్త కథనానికి పలు ఆసుపత్రుల యజమాన్యాలు స్పందించాయి. ముఖ్యంగా త్రినేత్ర డయాగ్నోస్టిక్ సెంటర్‌లో ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారమే స్కానింగ్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. రోగుల నుంచి అధిక ఫీజులను వసూలు చేయడం లేదని అడిగిన ప్రతి ఒక్కరికి పరీక్షలకు సంబంధించిన బిల్లు రసీదులను ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

రాజ్యాంగంపై అవగాహన ఉండాలి

ఇంద్రవెల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగంపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు సోన్‌కాంబ్లే మనోహర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల ఆవరణలో భీం ఆర్మీ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వ్యాసరచన పోటీల్లో 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో విజేతలకు రాజ్యాంగం దినోత్సవం రోజున బహుమతులు అందజేయనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే భారత రాజ్యాంగం అత్యున్నతమైనదన్నారు.

జైనథ్‌లో ఘోరరోడ్డు ప్రమాదం

- ఇద్దరి దుర్మరణం
- మృతుల్లో ఓ చిన్నారి, వృద్ధుడు
- ఒకరికి తీవ్రగాయాలు


షేక్‌అలీ మృతదేహం

జైనథ్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ జిల్లా జైనథ్ శివారులో సోమవారం ఆర్టీసీ బస్సు అదుపు తప్పి బైక్‌ను ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా.. మరొక్కరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. ఆదిలాబాద్ జిల్లాకేంద్రానికి చెందిన షేక్ అలీ (58), తమ మనువళ్లు షేక్ ఇజహాన్ (6), రిహాన్‌తో కలిసి సోమవారం జైనథ్‌లోని తన బంధువుల ఇంటికి బైక్‌పై వెళ్లాడు. సాయంత్రం వేళ బైక్‌పై తిరిగి ఆదిలాబాద్‌కు బైక్‌పై బయలుదేరారు. మార్గమధ్యలో జైనథ్ శివారులో మహారాష్ట్రలోని చంద్రపూర్‌కు వెళుతున్న ఆర్టీసీ బస్సు.. అతి వేగంతో బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో షేక్ అలీ, ఇజహాన్‌లు అక్కడికక్కడే మృతి చెందగా.. రిహాన్ తీవ్ర గాయాల పాలయ్యాడు. స్థానికులు గమనించి రిహాన్‌ను చికిత్స నిమిత్తం 108లో ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు. సమాచారం అందుకున్న జైనథ్ ఎస్సై పురుషోత్తం ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతుల కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు. ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్‌ను అదుపులోకి తీసుకున్నట్టు చెప్పారు.

దీక్షాదివాస్‌ను విజయవంతం చేయాలి

- బీఆర్ఎస్ జిల్లా ఇన్‌చార్జీ గంగాధర్‌గౌడ్

ఆదిలాబాద్, నవంబరు25 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 29న నిర్వహించే దీక్షాదివాస్‌ను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా ఇన్‌చార్జీ గంగాధర్‌గౌడ్ అన్నారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ అమరవీరుల త్యాగాలు, నిధులు, నీళ్ల పై జరిగిన అన్యాయం పై కేసీఆర్ నాయకత్వంలో ఎన్నో ఉద్యోమాలు చేయడం జరిగిందన్నారు. అమరవీరులను స్మరించుకుంటూ ఫొటో ఎగ్జిబిషన్‌తో పాటు అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించడం జరుగుతుందన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పాలాభిషేకం లాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రతి గ్రామంలో కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొని దీక్షా దివాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం మాజీ మంత్రి జోగురామన్న మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనకై పదవులను సైతం లెక్క చేయకుండా పోరాటం చేసిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కుతుందన్నారు. అలాగే బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు. కార్యకర్తలు ఉత్సాహంగా పని చేసి పార్టీని ముందుకు తీసుకెళ్లాలన్నారు.

అన్నదాతల ఊగిసలాట

(5వ పేజీ తరువాయి...)

ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 277.50 మీటర్లు కాగా, ప్రస్తుతం 277.100 మీటర్ల నీటి నిలువ ఉంది. అలాగే సాత్నాల ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 286.50 మీటర్లు కాగా, ప్రస్తుతం 285.10 మీటర్ల నీటి నిల్వలు ఉన్నట్లు అధికారిక లెక్కల ప్రకారం తెలుస్తుంది. దీంతో ఆయకట్టు సాగుకు సరిపడా సాగునీరు ఉన్న అధ్వానంగా తయారైన కాలువలతో అవస్థలు పడాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు. చెరువులు, కుంటలు, చెక్‌డ్యాంల ద్వారా అక్కడక్కడా వరి పంట సాగవుతోంది. ఈ యేడు అన్నిరకాల పంటలకు అనుకూలమైన వాతావరణం ఉండడంతో యాసంగి లో పెద్దమొత్తంలో పంటలను సాగు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. దాదాపుగా ఖరీఫ్ పంటల సాగు గట్టెక్కినా.. యాసంగి పంటల సాగునీటి లభ్యత పై అన్నదాతలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

పేదల కోసం ప్రభుత్వం అండగా ఉంటుంది

- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్

బోథ్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేదల కోసం పనిచేస్తున్నారని ప్రభుత్వం పేదప్రజలు, రైతుల సంక్షేమం కోసం పాటుపడుతుందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ పేర్కొన్నారు. బోథ్ మార్కెట్ యార్డులో మర్లపల్లి గ్రామానికి చెందిన సంజీవ్‌కు 42 వేల ముఖ్యమంత్రి సహాయ నిధిని అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ఏడాది పాలనలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని నాయకులు, కార్యకర్తలు కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, మాజీ ఎంపీటీసీలు కురుమే మహేందర్, షేక్, సహకార సంఘం డైరెక్టర్లు ఉమేష్ చెట్ల రాజు యాదవ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్, పార్టీ ప్రధాన కార్యదర్శి రాజు, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ బత్తుల రమేష్, సీనియర్ నాయకులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అబ్రార్, సిరి చల్మాజీ, ఉప సర్పంచ్ అజీమ్, సోనాల మండల సీనియర్ నాయకులు గాజుల పోతన్న, రైతు నాయకులు గడ్డం నారాయణ, సాయన్న, పాల శంకర్, వంశీ, హసీఫ్, భోజన పాల్గొన్నారు.

సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని వినతి

బోథ్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో సెంట్రల్ లైటింగ్ ఏర్పా టు చేయాలని సీపీఐ నాయకులు, పట్టణ అధ్యక్షులు నరేష్, మున్సి ఫ్ ఎంపీడీవో రమేష్ సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు సెంట్రల్ లైటింగ్ ఆవశ్యకత గురించి ఎంపీడీ వోకు వివరించడం జరిగింది. రాత్రిపూట పాఠశాల అంధకారంలో ఉంటుందని, దొంగతనాలు జరిగే ప్రమాదం ఉందని వారన్నారు.

జీవో 1ను రద్దు చేయాలని కలెక్టరేట్ ఎదుట ధర్నా

ఆదిలాబాద్ రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులకు ఆసరా పింఛన్ ఆదాయ పరిమితి విధిస్తు తీసుకువచ్చిన జీఓ 17ను రద్దు చేయాలని ఎన్పీఆర్డీ జిల్లా అధ్యక్షులు ఎం.నగేష్ డిమాండ్ చేశారు. ఎన్పీఆర్డీ ఆధ్వర్యంలో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ హోరెత్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన తర్వాత దివ్యాంగులకు పింఛన్ రూ.6 వేలు ఇస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించి ఏడాది పూర్తి అవుతున్న ఇప్పటి వరకు ఎలాంటి స్పందన లేదన్నారు. ఇచ్చిన హామీల అమలుతోపాటు జీవో 17ను రద్దు చేయాలన్నారు. 2014 నుంచి 2023 వరకు వికలాంగులకు కేటాయించిన బడ్జెట్‌ను సక్రమంగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎన్పీఆర్డీ సంఘం ప్రధాన కార్యదర్శి ఆరిఫా, అనసూయ, పొచ్చన్న, మారుబాయి, పూజ, ఆత్మరాం పాల్గొన్నారు.

ఉపాధి కల్పించాలని ధర్నా

ఆదిలాబాద్ రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వాలు మారుతున్న సామాన్య ప్రజల స్థితిగతులు మాత్రం మారడం లేదని ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు అగ్గిమల్ల గణేష్ మహారాజ్ అన్నారు. సోమవారం పార్టీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సామాన్య ప్రజలకు ప్రభుత్వాలు అండగా ఉంటూ విద్య, వైద్యం అందించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా గణేష్ మహారాజ్ మాట్లాడుతూ రాష్ట్రంలో అగ్రకులాల పాలనలో అట్టడుగు వర్గాలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల జీవితాలు మారడం లేదన్నారు. వారికి విద్య, వైద్యం ఉపాధి, ఇల్లు కల్పించడంలో విఫలమయ్యాయని ఆరోపించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి లక్ష్మణ్, వివిధ మండలాధ్యక్షులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో విద్యుత్‌శాఖ ఆపరేటర్ ఆత్మహత్య


జాదవ్‌బిక్కు మృతదేహం

ఉట్నూర్, నవంబరు25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శ్యామనాయక్ తండాకు చెందిన జాదవ్ బిక్కు(34) ఆర్థిక ఇబ్బందులతో పాటు అనారోగ్యంతో బాధపడుతు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విద్యుత్ శాఖలో ఆపరేటర్‌గా పనిచేస్తున్న బిక్కు కొన్నిరోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడని, దీంతో పాటు మనస్తాపం చెంది ఈ నెల 17న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని, కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆదిలాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించగా అక్కడ చికిత్సపొందుతూ సోమవారం మృతిచెందాడని గ్రామస్థులు తెలిపారు. మృతుడికి భార్య విజయ బాయితో పాటు ఇద్దరు కొడుకులు, ఇద్దరు బిడ్డలు నలుగురు సంతానం ఉన్నారని గ్రామస్థులు తెలిపారు. ఉట్నూర్ ఎస్సై మనోహర్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సర్వేలో ఉపాధ్యాయులను మినహాయించాలి

- టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు స్వామి

బజార్‌హత్నూర్, నవంబర్ 25 : రాష్ట్రంలో 15 రోజుల నుంచి చేపట్టిన ఆర్థిక, సామాజిక కులగణన సర్వేను ఆన్లైన్ చేసే ప్రక్రియ నుంచి ఉపాధ్యాయులను మినహయించాలని టీఎస్‌యూ టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఏ.స్వామీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో నిర్వహించిన టీఎస్‌యూటీఎఫ్ సభను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ గత 15ను రోజుల నుంచి ఒక పూట పాఠశాల విధులను నిర్వహిస్తూ మరోపూటా సర్వేచేసిన సందర్భంలో ఇప్పటికే ప్రాథమిక విద్య వెనుకబాటుకు గురైందని, మళ్లీ సర్వే ఆన్‌లైన్ పేరిట కూడా ఉపాధ్యాయులకు విధులు కేటాయిస్తే విద్యార్థులకు ప్రాథమిక విద్య దూరమయ్యే అవకాశం ఉందని ఆయన తెలిపారు. రెగ్యులర్ ఉపాధ్యాయులతో సమానంగా అన్ని సెలవులు వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎం.శ్యాంసుందర్, మండల అధ్యక్షుడు బగత్ బాపురావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

27 వరకు సోయా పంట కొనుగోలు నిలిపివేత

బోథ్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మార్కెట్ యార్డులో సోయాబీన్ పంట కొనుగోళ్లను బుధవారం వరకు నిలిపివేస్తున్నట్లు సెంటర్ ఇన్‌చార్జి గోలిస్వామి తెలిపారు. రైతులు గురువారం పంటను తీసుకురావాలని ఆయన సూచించారు.

బీజేపీ కార్యకర్త కుటుంబానికి పరామర్శ

బోథ్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సోనాలలో రెండు రోజుల క్రితం మృతి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు, కార్యకర్త తుల మల్లయ్య మృతిచెందడంతో ఆయన కుటుంబాన్ని సోమవారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బీజేపీ మండల కన్వీనర్ అయ్యన్న గారి భూమయ్య పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆందోళన చెందవద్దని తమ సహకారం ఉంటుందని కుటుంబసభ్యులను ఓదార్చారు. ఆయన వెంట బీజేపీ మాజీ మండల కన్వీనర్ సుభాష్, సూర్యలున్నారు.

పరీక్షలు అంటే భయపడవద్దు

బోథ్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పరీక్షలు అంటే భయ పడవద్దని ఆత్మవిశ్వాసంతో ముందుకు కదిలి పరీక్షలను రాయాలని రాష్ట్రస్థాయి పోటీపరీక్షల నిపుణులు గుడిసెల రమణగౌడ్, అల్లం సాయికృష్ణలు పేర్కొన్నారు. మండలంలోని దన్నూర్ గ్రామంలో పదోతరగతి విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కల్పించారు. పరీక్షలంటే భయం వీడి ఆత్మస్థైర్యంతో రాయాలన్నారు. తల్లిదం డ్రులు ఆశయాలకనుగుణంగా చదివి ఉన్నతులుగా ఎదగాలని కోరారు. చదివితేనే సమాజంలో గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రావుల శంకర్ పాల్గొన్నారు.

నిర్మల్ జిల్లా కేంద్రంలో ముగిసిన చండీయాగం



నిర్మల్ కల్చరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్‌లో గత పదిహేను రోజులుగా నిర్వహిస్తున్న శ్రీవైష్ణవ ఆయుత చండీయాగం సోమవారం పూర్ణాహుతితో ముగిసింది. శ్రీ కృష్ణజ్యోతి స్వరూపానంద స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన విశ్వకళ్యాణార్థం నిర్వహించిన యాగంలో పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు. చివరి రోజు బీజేపీ నాయకులు రావుల రాంనాథ్, సాధం అరవింద్, పోడెల్లి గణేష్, ఆమెడ శ్రీధర్, కే. దేవేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి రూ. 1 కోటి మంజూరు

- ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్

భైంసా, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలోని భైంసా మండలంలో గల వివిధ గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.1 కోటి మంజూరైనట్లుగా ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ తెలిపారు. సోమవారం భైంసాలోని తన క్యాంపు కార్యాలయంలో మండల పరిధిలోని ఆయా గ్రామాల ప్రతినిధులకు సీసీ రోడ్ల నిర్మాణపు మంజూరి పత్రాలను అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం పై ప్రత్యేకదృష్టి సారించినట్లుగా వివరించారు. ప్రధానంగా సీసీ రోడ్లు, మురికి కాలువల నిర్మాణాలకు అధిక ప్రాధాన్యతనిస్తున్నామని వెల్లడించారు. ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా నియోజక వర్గ పరిధిలోని ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు గాను ప్రణాళికబద్ధంగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. గ్రామాలను ప్రగతి బాటలో పయనింపచేయడమే తమ ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు. ఇందులో భైంసా మాజీ ఎంపీపీ అబ్దుల్‌రజాక్, మాజీ వైస్ ఎంపీపీ నర్సారెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యులు సోలంకే భీంరావ్ పాటిల్, బీజేపీ మండల అధ్యక్షులు భూమేష్, మాజీ ఎంపీటీసీ సభ్యులు ప్రతాప్‌సింగ్, వెంకట్‌రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం



ఖానాపూర్‌లో ఉచితంగా చేపపిల్లలను పంపిణీ చేస్తున్న దృశ్యం

ఖానాపూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మత్స్యకారుల అభివృద్ధికి తమ ప్రభుత్వం కృషి చేస్తుందని ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ... తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మత్స్యశాఖ ఆధ్వర్యంలో మత్స్య సంపదను పెంపొందించడమే లక్ష్యంగా ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేస్తోంద న్నారు. అనంతరం పలు గ్రామాలకు చెందిన మత్స్యకారులకు ఉచితంగా చేప పిల్లలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సునీత, మత్స్యశాఖ అభి వృద్ధి అధికారి విజయకుమార్, కాంగ్రెస్ పార్టీ పట్ట ణ అధ్యక్షులు నిమ్మల రమేష్, నాయకులు పరిమి సురేష్, లక్ష్మీపతిగౌడ్, తిరుపతిగౌడ్, ఫీల్డ్ అధికారులు రాజేందర్, రంజిత్‌కుమార్, గంగపుత్ర సంఘం సభ్యులు గణేష్, నవీన్, తదితరులున్నారు.

నేటి నుంచి గొర్రెలు, మేకలకు

పారుడు వ్యాధి నివారణ టీకాలు


మేకకు వ్యాక్సిన్ వేస్తున్న డాక్టర్


మేకల మంద

భైంసా, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) ; మూగజీవాల్లో పారుడు వ్యాధి నివారణకు జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఉన్న గొర్రెలు, మేకలకు పశువైద్యశాఖ ఆధ్వర్యంలో ఉచితంగా వ్యాక్సిన్‌ను వేయనున్నారు. ఇందుకు సంబంధించి ఇటీవలే ఆదేశాలు సైతం వచ్చాయి. జిల్లాలో మొత్తం 4,48,107 జీవాలు ఉండగా.. వీటిలో మేకలు 3,47,994 గొర్రెలు 1,00,113 ఉన్నాయి. వీటికి పారుడు వ్యాధి సోకకుండా మంగళవారం నుంచి వచ్చే నెల 11వ తేదీ వరకు పూర్తిగా ఉచితంగా ఇంటింటికి తిరుగుతూ వైద్య సిబ్బంది వ్యాక్సిన్ వేయనున్నారు. ప్రస్తుత వాతావరణంలో మేకలు, గొర్రెల్లో పారుడు వ్యాధి వ్యాపించే అవకాశముంది. దీంతో జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామాల్లోని జీవాలకు కేంద్ర ప్రభుత్వం అందించే ఈ వ్యాక్సిన్‌ను వేయనున్నారు. ఏటా ఈ టీకాలను పంపిణీ చేస్తున్నారు. గత ఐదేళ్ల నుంచి క్రమం తప్పకుండా వ్యాక్సిన్ వేయడంతో జీవాల్లో పారుడు వ్యాధి తగ్గి, మరణాల సంఖ్య సైతం తగ్గిందని జిల్లా పశువైద్యాధికారులు చెబుతున్నారు. గ్రామాల్లోకి అధికారులు, సిబ్బంది వెళ్లే ముందు జీవాల యజమానులకు సమాచారం అందించి టీకాలు వేయనున్నారు. ఈ వ్యాక్సిన్‌ను 4 డిగ్రీల సెంటిగ్రేడ్‌ల చల్లదనంలో ఉంచుతారు. సాధ్యమైనంత వరకు ఎండ రాకముందు వేస్తారు.


పారుడు వ్యాధి నివారించే వ్యాక్సిన్ ఇదే..

● ఆన్‌లైన్‌లో నమోదు

ఈ టీకాలు వేసిన అనంతరం వైద్యులు సిబ్బంది పేర్లతో పాటు జీవాల సంఖ్యను భారత్ పశుధన్ యాప్‌లో నమోదు చేయనున్నారు. దీంతో రోజు ఎన్ని టీకాలు వేశారు. ఎన్ని జీవాలు ఉన్నాయనే సమాచారం పక్కాగా తెలుస్తుంది. వ్యాక్సిన్ వేయడంలో సిబ్బంది అలసత్వం వహించకుండా ఉంటుంది. సంబంధిత విషయంలో జిల్లా పశుసంవర్ధక శాఖాధికారులు ఆయా మండలాల్లోని పశువైద్యాధికారులతో సమావేశం నిర్వహించి టీకాల కార్యక్రమ నిర్వహణపై దిశానిర్దేశం చేశారు.

● సకాలంలో పూర్తి చేస్తాం



జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా పారుడు వ్యాధికి సంబంధించిన వ్యాక్సిన్ వేయడం సకాలంలో పూర్తి చేస్తాం. జీవాల యాజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. గ్రామాల్లో ముందస్తు సమాచారం అందించి వ్యాక్సిన్ వేసే కార్యక్రమాలు చేపడుతాం

(డా.విఠల్, పశువైద్యాధికారి, భైంసా)

సమస్యలు పరిష్కరించనప్పుడు గద్దె దిగాలి : ధర్మసమాజ్ పార్టీ


ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

నిర్మల్ అర్బన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు కనీస, తప్పనిసరిగా ప్రభుత్వాలు ఇవ్వవలసిన విద్య వైద్యం, ఉపాధి, ఇళ్లు, భూమి వంటి సమస్యలు పరిష్కరించనప్పుడు గద్దె దిగాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా కన్వీనర్ రామగిరి రవీందర్ డిమాండ్ చేశారు. సోమవారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రభుత్వమే ఉచితంగా విద్య, వైద్యం అందించాలని, ప్రతీ ఒక్కరికి ఉపాధి కల్పించాలి. అర్హులైన వారందరికీ ఒక ఎకరం భూమి, ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, నవంబరు 18 నుంచి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టర్లు, తహసీల్దార్లకు మెమోరాండంలో ఇచ్చిన ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం తన చేతగాని తనాన్ని ప్రదర్శించడమేనన్నారు. అగ్రకులాల వద్ద ప్రైవేట్ ఆసుపత్రులు, విద్యాలయాలు ఉండటం వల్లే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రభుత్వ విద్యను, వైద్యాన్ని నిర్లక్ష్యం చేస్తుందని, తద్వారా అగ్రకులాలకు వ్యాపార అవకాశాలు కల్పిస్తుందని విమర్శించారు. ఈ ఐదు డిమాండ్లను పరిష్కరించకపోతే 90 శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీలకు జరుగుతున్న దోపిడీని, దోచుకుంటున్న అగ్రకులాలను ఈ ప్రజాక్షేత్రంలో నిలబెడతామని హెచ్చరించారు. ఈ ధర్నాకు రజక సంఘం జిల్లా నాయకులు నిమ్మల చిన్న గంగాధర్, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కమిటీ సభ్యులు శివయ్య ముదిరాజ్, నారాయణ, జిల్లా కమిటీ సభ్యులు పాతర్ల హరీష్ ముదిరాజ్, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు శంకర్, మాదిగ అంబేద్కర్ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు నిగులపు లింగన్న, జిల్లా అధ్యక్షులు అడ్డిగ లక్ష్మణ్‌లు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మసమాజ్ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు రాజు మహారాజ్, సిలారి శ్రీనివాస్ మహారాజ్, సొన్న భూమేష్, కల్లూర్ సుధాకర్, కే. వినోద్, కత్తి శేఖర్ మహారాజ్, షేక్ నహీం, తొర్తి గణేష్, తదితరులు పాల్గొన్నారు.

తరుగు పేరిట దోచుకుంటున్నారు

- కడెం మండలం చిన్న బెల్లాల్‌లో రైతుల ఆందోళన

ఖానాపూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులు తరుగు పేరిట తమను దోచుకుంటున్నారని కడెం మండలం చిన్న బెల్లాల్ గ్రామ రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని చిన్నబెల్లాల్ గ్రామంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రం ఎదుట ఆదివారం రాత్రి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఒక బస్తా ధాన్యం తూకం వేసేందుకు రెండున్నర కిలోల ధాన్యాన్ని అదనంగా తూకం వేస్తున్నారని ఆరోపించారు. సంచి బరువుతో పాటు ఓ బస్తా ధాన్యం 40 కిలోల 600ల గ్రాములు తూకం వే యాల్సి ఉండగా 42.5 కిలోలు తూకం వేస్తున్నారని వారు పేర్కొన్నారు. అంతేకాకుండా 30 బస్తాల ధాన్యానికి పైగా విక్రయించిన రైతుల వద్ద అదనంగా ఒక బస్తా ధాన్యాన్ని తరుగు పేరిట దోచుకుంటున్నారన్నారు. జిల్లా అధికార యంత్రాంగం దృష్టి సారించి ఈ తతంగానికి కారకులైన సెంటర్ నిర్వాహ కులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్య క్రమంలో రైతులు రాజ్యానాయక్, నూనావత్ తిరుపతి, రవీందర్, నరేందర్, కృష్ణ, తిరుపతి, రాజేష్ నాయక్, తదితరులున్నారు.

ప్రైవేట్ కళాశాలల నిరవధిక బంద్ నేపథ్యంలో

డిగ్రీ సెమిస్టర్ పరీక్షల షెడ్యూల్‌లో మార్పు

- మొదటి మూడు రోజుల పరీక్షలు వాయిదా
- 29వ తేదీ నుంచి పాతషెడ్యూల్ ప్రకారమే పరీక్షలు

భైంసా, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో మంగళవారం నుంచి ప్రారంభం కావాల్సిన సెమిస్టర్ పరీక్షల షెడ్యూల్‌లో మార్పు చోటు చేసుకుంది. ప్రైవేట్ డిగ్రీ,పీజీ కళాశాలల యాజమాన్యాలు ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిల కోసం గాను గత 7 రోజులుగా కొనసాగిస్తున్న కళాశాలల నిరవధిక బంద్ నేపథ్యంలో యూనివర్సిటి అధికారులు షెడ్యూల్‌లో మార్పులు చేపట్టారు. ఈ క్రమంలో మంగళవారం నుంచి ప్రారంభం కావాల్సిన పరీక్షలలో మొదటి మూడు రోజుల పరీక్షల నిర్వాహణ షెడ్యూల్‌లో మార్పు జరిగింది. ఇది వరకు ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం 29వ తేది నుంచి జరుగాల్సిన పరీక్షలు యదావిధిగా కొనసాగనున్నాయి. మొదటి మూడు రోజులు వాయిదా వేసిన పరీక్షలను వచ్చె నెల 14 వ తేది నుంచి నిర్వహించేందుకు కాకతీయ యూనివర్సిటీ అధికార యంత్రాంగం తాజాగా సోమవారం షెడ్యూల్ విడుదల చేసింది. యూనివర్సిటి అధికారులు తీసుకున్న నిర్ణయంతో రెండు రోజులుగా సెమిస్టర్ పరీక్షలపై విద్యార్థుల్లో నెలకొన్న సందిగ్ధతకు తెరపడింది. యూనివర్సిటీ అధికారుల ఆదేశాలు, మార్చిన షెడ్యూల్‌కు అనుగుణంగా పరీక్షలు నిర్వహించేందుకు ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు చర్యలు చేపట్టాయి. అయితే పరీక్షలు ముగిసిన అనంతరం ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిల కోసం గాను యాజమాన్యాలు నిరవధిక బంద్‌ను కొనసాగిస్తాయా లేక యదావిధిగా తరగతులు నిర్వహిస్తాయా అనే విషయంలో చర్చ జరుగుతోంది.

గ్రామ మ్యాప్‌ను పరిశీలించిన శిక్షణ ఆఫీసర్లు

సోన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బొప్పారం గ్రామంలో సోమవారం శిక్షణ ఐపీఎస్, ఐఎఫ్ఎస్, ఐఆర్ఎస్‌లు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. అనంతరం గ్రామ మ్యాప్ పరిశీలించారు.

ఆంధ్రజ్యోతి పరిశీలన



సోయాబీన్ పంట కొనుగోళ్లను పరిశీలిస్తున్న కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి, ఏఎంసీ చైర్మన్లు

సోయాబీన్ కొనుగోళ్లలో జాప్యం

● గన్నీ బ్యాగులు లేక రైతుల అవస్థలు
● బార్కోడ్ వేయకపోగా వారాల తరబడి ఎదురు చూపులు

బోథ్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): బోథ్ మార్కెట్ యార్డులో సోయాబీన్ పంట కొనుగోలు జాప్యం జరుగుతుంది. ఫలితంగా రైతులు నాలుగు, ఐదు రోజులుగా మార్కెట్ యార్డులోనే ఎముకలు కొరికే చలిలో కాపలా ఉండాల్సి వస్తుంది. అంతేగాక దూర ప్రాంతం నుంచి వచ్చే రైతులు తమ కుటుంబీకులు సద్ది అన్నం తెచ్చేంత వరకు ఎదురు చూడాల్సిన దుస్థితి నెలకొంది. పంట కొనుగోలు చేపడుతున్న మార్క్‌ఫెడ్ సహకార సంఘం వారి నిర్లక్ష్యం వల్ల రైతులు ఈ దుస్థితి నెలకొందని పేర్కొంటూ రైతులు వాపోతున్నారు.

● వారం రోజులుగా మార్కెట్‌లోనే ఉన్నాం..

గత మంగళవారం సోయా బీన్ పంటను మార్కెట్‌కు తీసుకువచ్చాం. ఆనాటి నుంచి సోయాబీన్ పంటకు కాపలాగా ఉండాల్సి వస్తుంది. తూకంలో జాప్యం జరగడంతో పాటు కొనుగోలు చేసిన సోయాలను లోడింగ్ చేసి పంపించడంలో జాప్యం జరుగుతుందని ఫలితంగా తాము ఇక్కడే ఉండాల్సి వస్తుందని మండలంలోని రామ్‌నగర్ గ్రామానికి చెందిన రైతులు వాపోయారు. మరికొంత మంది రైతులు బార్కోడ్ లేక అవస్థలు పడాల్సి వస్తుందన్నారు. అయితే తూకం వేసిన బస్తాలను కుట్టేందుకు దారంతో పాటు అందుకు అవసరమైన ఆయిల్ సైతం కొనుగోలు చేసుకోవాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు.

● గన్ని బ్యాగులు లేవు తెప్పించండి..

మార్కెట్‌లో గన్ని బ్యాగులు లేక ఇబ్బందులు పడుతున్నామని గన్నీ బ్యాగులను తెప్పించాలని రైతులు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్‌కు విన్నవించారు. దీంతో వెంటనే జిల్లా అధికారులతో ఫోన్‌లో ఈ విషయమై సంప్రదించగా సాయంత్రం వరకు గన్నీ బ్యాగులను పంపుతామని అధికారులు పేర్కొన్నారు. మరో వైపు రైతులు ఆందోళన చెందొద్దని అక్కడే ఉన్న మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, సహకారం సంఘం డైరెక్టర్లు రాజు యాదవ్, చెట్ల ఉమేష్‌లు పేర్కొన్నారు. ఏదైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని రైతులకు సూచించారు.



సోయాబీన్ కొనుగోళ్లు అమ్మకానికి తీసుకువచ్చి మార్కెట్ యార్డులోనే మధ్యాహ్న భోజనం చేస్తున్న రైతులు

సారు మీటింగ్‌కు వెళితే ఆ బడికి సెలవే!

● 40 మంది విద్యార్థులకు ఒక్కడే ఉపాధ్యాయుడు ● ఉన్నతాధికారుల నిర్లక్ష్యంతో ఉన్నత చదువులకు దూరమవుతున్న గిరి పుత్రులు

స్పందించండి



విద్యార్థులతో కలిసి ప్రార్థన చేస్తున్న ఒకే ఒక్క ఉపాధ్యాయుడు



పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్న ఉపాధ్యాయుడు

తలమడుగు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్సి (బి) తండాలో గల గిరిజన సంక్షేమ శాఖ ఐటీడీ ద్వారా ఏర్పాటు చేసిన పాఠశాలలో 40 మంది విద్యార్థులకు ఒకే ఒక ఉపాధ్యాయున్ని నియమించింది. పాఠశాలలో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు 40 మంది విద్యార్థులు ఉండగా వారికి కనీసం నలుగురు మంది ఉపాధ్యాయులు ఉండాల్సి ఉండగా ఐటీడీ అధికారులు ఒకే ఉపాధ్యాయున్ని నియ మించడంతో ఉపాధ్యాయుడు 40 మంది విద్యార్థులకు విద్యా బోధన అందించేందుకు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజనం పర్యవేక్షణ, ఉన్నతాధికారులు ఏర్పాటు చేసే సమావేశాలకు ఉపాధ్యాయుడు వెళ్లడంతో పాఠశాలకు తప్పనిసరి సెలవు ఇవ్వాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అంతేకాకుండా ప్రభుత్వం ఆదేశాల ప్రకారం సర్వే ఇతర సమావేశాలకు వెళ్లడంతో విద్యార్థులకు విద్యాబోధనలు సక్రమంగా అందడం లేదని ఆదివాసీ విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ పాఠశాలకు మరో ఇద్దరు పాధ్యాయులను నియమించాలని పలుమార్లు ఐటీడీ అధికారులకు ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఎవరూ స్పందించడం లేదన్నారు. దీంతో ఆదివాసీ విద్యార్థులకు చదువులకు దూరమయ్యే అవకాశం ఉందని గ్రామస్థులు పేర్కొన్నారు. ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలకు మరో ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

● ఇబ్బందిగా ఉంది..



మండలంలోని పల్సి(బి) తండా పాఠశాలలో 40 మంది విద్యార్థులతో ఇబ్బందిగా ఉంది. ప్రతి విద్యార్థిపై శ్రద్ధ వహించలేకపోతున్నాం. ఒకటవ తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులను పరిరక్షించాలంటే ఎంతో కష్టం. అధికారులు స్పందించి మరో ఉపాధ్యాయున్ని నియమించాలి.

- రామారావు, ప్రధానోపాధ్యాయుడు

● వెంటనే ఉపాధ్యాయులను నియమించాలి



గ్రామంలోని పాఠశాలకు ఒకే ఒక్క ఉపాధ్యా యుడు ఉండటంతో విద్యార్థులకు సరైన విద్యా బోధన అందడం లేదు. ప్రభుత్వం స్పందించి వెంటనే ఉపాధ్యాయులను నియమించాలి. లేనిపక్షంలో గ్రామస్థులమంతా కలిసి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం.

- రాథోడ్ రాజేశ్వర్, విద్యార్థి తండ్రి

వణుకు పుట్టిస్తున్న చలి

● బేల మండలంలో కనిష్ఠంగా 9.9 డిగ్రీల సెల్సియస్ నమోదు

చలి పంజా



ఆదిలాబాద్ పట్టణ పరిసర ప్రాంతాలను కప్పేసిన పొగమంచు



ఆదిలాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గత కొద్ది రోజులుగా ఆదిలాబాద్ జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు వేగంగా పడిపోవడంతో చలి తీవ్రత పెరిగి వణుకు పుట్టిస్తోంది. సోమవారం జిల్లా సగటు గరిష్ఠ ఉష్ణోగ్రతలు 29.3 డిగ్రీలు కాగా కనిష్ఠంగా 10.8 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యాయి. అలాగే బేల మండలంలో అత్యల్పంగా 9.9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. బజార్‌హత్నూర్, బోథ్‌లో 10.0 డిగ్రీలు కాగా భీంపూర్‌లో 10.1, జైనథ్‌లో 10.2, నేరడిగొండలో 10.3 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ముఖ్యంగా జిల్లాలోని భీంపూర్ మండలం అర్లి(టి), బోథ్ మండలం సోనాల, జైనథ్ మండలం బోరజ్ ప్రాంతాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. బేల, బజార్‌హత్నూర్, బోథ్ మండలాల్లో 10 డిగ్రీల లోపు ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ఎల్లో అలర్ట్‌ను ప్రకటించారు. దాదాపు జిల్లా వ్యాప్తంగా 15 డిగ్రీల లోపే కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో మారుమూల ప్రాంతాలు చలితో వణికి పోతున్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో చలిమంటలు వేసుకుంటూ ప్రజలు వెచ్చదనం పొందుతున్నారు.

మార్కెట్ వాచ్



ఇంద్రవెల్లిలో రోడ్డుపై స్వెటర్లను కొనుగోలు చేస్తున్న దృశ్యం

వెచ్చని నేస్తాలు.. ఉన్ని దుస్తులు

● రోజురోజుకూ పెరుగుతున్న చలి తీవ్రత ● నాణ్యత, సైజ్‌ను బట్టి ధరలు

ఇంద్రవెల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): చలి కాలంలో ఉన్ని దుస్తులు వెచ్చని నేస్తాలుగా చలి నుంచి రక్షణనిస్తాయి. రోజురోజుకూ పెరుగుతున్న చలి తీవ్రత నుంచి కాపాడు కునేందుకు మండల ప్రజలు స్వెటర్లు కొనుగోలు చేస్తున్నారు. ఇక్కడి ప్రజల అవసరాలను గురించి మధ్యప్రదేశ్ వాసులు మండల కేంద్రంలో రోడ్డుపై షెడ్లు వేసి ప్రత్యేకంగా దుకాణాలు పెట్టారు. ఈ దుకాణాల్లో ఉలాన్ స్వెటర్లు విక్రయిస్తూ జీవనోపాధి పొందుతున్నారు. చలి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ఈ స్వెటర్లకు డిమాండ్ పెరుగుతుంది. నేడు ఉన్ని వస్త్రాలు కూడా వివిధ రకాల్లో ఆకర్షనీయమైన డిజైన్‌లలో లభిస్తున్నాయి. అందుబాటులో అనేక రకాలు చలితో పాటు వర్షానికి కూడా తట్టుకునేలా టూ ఇన్ వన్ రకాలు అందుబాటులో ఉన్నాయి. స్వెటర్లు, జెర్కిన్లు, శాలువాలు, మంకీ టోపీలు ఇలా అనేక రకాలైన ఉన్ని దుస్తులు అందుబాటులో ఉన్నాయి. చిన్నారులను ఆకర్షించేలా పలు చోటాభీమ్, లిటిల్ సింగం తదితర రకాల జంతువుల బొమ్మలతో కూడిన స్వెటర్లు లభిస్తున్నాయి. మహిళలు, వృద్ధులకు, యువతకు అనుకూలమైన వివిధ రంగుల్లో అమ్మకానికి పెట్టారు. వీటి ధర రూ.150నుంచి 200వరకు నాణ్యత, సైజ్‌ను బట్టి ధరలు ఉన్నట్లు వ్యాపారులు చెబుతున్నారు.

● నాణ్యత, సైజ్‌ను బట్టి ధరలు

చలితో పాటు వర్షానికి కూడా తట్టుకునేలా టూ ఇన్ వన్ వంటి రకాలు, చిన్నారులు, యువత, మహిళలను ఆకట్టుకునేలా అనేక రంగుల ఉన్ని దుస్తులు అందుబాటులో ఉన్నాయి. నాణ్యత, సైజ్‌ను బట్ట ధరలు ఉంటాయి. వ్యాపారం బట్టి మూడు నెలల పాటు మండల కేంద్రంలో ఉంటాం. ఆ తరువాత స్వస్థలాలకు వెళ్లి పోతాం.

- రాజేశ్యామ్, వ్యాపారి, మధ్యప్రదేశ్

● అందుబాటులో చాలా వెరైటీలు

అన్ని రకాల స్వెటర్లు దొరుకుతున్నాయి. ఒకప్పుడు ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి వెళ్లి తీసుకునే వాళ్లం. ఇక్కడే అన్ని రకాల దుస్తులు లభించడంతో సమయం, డబ్బులు ఆదా అవుతున్నాయి. మంచి క్వాలిటీ స్వెటర్లు దొరుకుతున్నాయి. తాత్కాలికంగా ఏర్పాటు చేసిన ఈ దుకాణాల్లో ధరలు కూడా తక్కువగానే ఉన్నాయి.

- నందకుమార్, కొనుగోలుదారు, ఇంద్రవెల్లి



అధ్వానంగా తాంసి(కె) రహదారి



తాంసి (కె)లో గుంతలమయమైన రోడ్డుతో ఇబ్బంది పడుతున్న రైతు



అధ్వానంగా ఉన్న తాంసి(కె) రోడ్డు



అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

● తరచూ ప్రమాదాలు
● పట్టించుకోని అధికారులు

భీంపూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాంసి(కె) రహదారి పూర్తిగా అధ్వానంగా మారింది. అధికారులు పట్టించుకోకపోవడం వల్ల ఈ ప్రాంత ప్రజలు నరకం అనుభవిస్తున్నారు. గతంలో తాంసి(కె) ఆర్టీసీ అధికారులు బస్సు నడిపేవారు. ప్రస్తుతం ద్విచక్ర వాహనాలు, ఆటోలు కూడా నడిచే పరిస్థితి లేదు. రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. పిప్పల్ కోటి ఎక్స్ రోడ్డు నుంచి తాంసి(కె) వరకు సుమారు 10 కిలో మీటర్ల రహదారి ఇంత అధ్వాన్నంగా మారిన అధికారుల్లో మాత్రం మార్పు కానరావడం లేదు. ఎవరూ పట్టించుకోకపోవడంతో ఈ ప్రాంత ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమకు మెరుగైన రోడ్డు సౌకర్యం దొరుకుతుందో లేదోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● ఈ రహదారిలో రైతులకు నరకమే..

ఈ రహదారితో ఈ ప్రాంతంలోని నిపాని, పిప్పల్‌కోటి, గొల్లగడ్, తాంసి(కె) తదితర గ్రామాలకు చెందిన రైతుల పంట పొలాలు ఉన్నాయి. ప్రతీ నిత్యం రైతులు ఈ రహదారి వెంటే వెళ్లాల్సి ఉంటుంది, ఎడ్లబండ్లు సైతం ఈ రహదారి వెంట నడవలేని దుస్థితి ఎదురవుతుంది. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డును బాగు చేయాలని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● టెండర్లు పూర్తయినా నిర్మాణంలో జాప్యం...?

ఈ రోడ్డు నిర్మాణం కోసం టెండర్లు కూడా పూర్తి అయినట్లు తెలుస్తుంది. టెండర్లు పూర్తి అయినప్పటికీ సదరు కాంట్రాక్టర్ రోడ్డు పనులు ప్రారంభించకపోవడంతో ఈ ప్రాంత ప్రజలు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ జోక్యం చేసుకుంటే తప్పా ఈ రహదారి పనులు ప్రారంభం అయ్యేలా లేదని ఈ ప్రాంత ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నత అధికారులు ఎమ్మెల్యే అనిల్ జాదవ్ జోక్యం చేసుకుని పనులు వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకుని ఈ ప్రాంత ప్రజలకు రహదారి సౌకర్యం మెరుగు పరచాలని కోరుతున్నారు.

● కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్...

ఈ రహదారితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తాంసి(కె) గ్రామస్థులు, ప్రజలు కలెక్టర్‌కు సర్వే సందర్భంలో తెలిపారు. కలెక్టర్ సైతం అధికారులకు సమస్య పరిష్కరించాలని సంబంధిత శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అయినప్పటికీ అధికారుల్లో కదలిక లేక రోడ్డు నిర్మాణ పనులు చేపట్టలేదని వారు వాపోతున్నారు. ఆర్టీసీ అధికారులు సైతం బస్సు సౌకర్యం కల్పిస్తామని చెప్పిన ఇప్పటికీ బస్సు రావట్లేదు. దీనిపై ఉన్నతాధికారులు దృష్టిసారించాలని స్థానికులు కోరుతున్నారు.

● కలెక్టర్ చెప్పినా పట్టించుకోని అధికారులు ..



కలెక్టర్ సారు కుటుంబ సర్వేలో భాగంగా మా ఊరికి వచ్చినప్పుడు ఈ రోడ్డు నిర్మాణం గురించి సారుకు మేము తెలపగా వెం టనే సారు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్య పరిష్కరిం చాలని చెప్పారు. కాని ఇంత వరకు అధికారులు ఇటువైపు చూడ లేదు. రోడ్డు నిర్మాణం లేదు. ఆర్టీసీ బస్సు సైతం రావట్లేదు. ఇప్పటి కైనా సమస్య పరిష్కరించాలి.

- బక్కి భోజన్న యాదవ్, తాంసి(కె), గ్రామస్థుడు

● రోడ్డుతో ప్రమాదాలకు గురవుతున్నాం..



ఈ రోడ్డు గుండా మేము వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. చాలా సార్లు ప్రమాదాలకు సైతం గురయ్యాం. ఎడ్లబండ్లు బోల్తా పడ్డ ఘటనలు సైతం ఉన్నాయి. ప్రతీ నిత్యం మేము ఈ రోడ్డు గుండే వెళ్లాల్సి ఉంటుంది. ఉన్నతాధికారులు మా గోడు తీర్చాలి.

- షేక్ హసన్ మహ్మద్

రిమ్స్‌ను సందర్శించిన బోథ్ ఎమ్మెల్యే

ఆదిలాబాద్ రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిని సోమవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. రోగులకు మెరుగైన వైద్యం అందించాలని సిబ్బందికి సూచించారు. అంతకు ముందు పలు రిజిష్టర్లను పరిశీలించారు. కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



రోగులతో మాట్లాడుతున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

andhrajyothy.com సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 29.4 | కనిష్ఠం 14.5



తుది ఓటరు జాబితాపై

నేడు ఖానాపూర్‌లో రాజకీయ నాయకులతో సమావేశం

ఖానాపూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో తుది ఓటరు జాబితాపై ఆయా రాజకీయ పార్టీల మండల అధ్యక్ష, కార్యదర్శులతో నేడు (మంగళవారం) ఖానాపూర్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించ నున్నట్లు ఎంపీవో చిక్యాల రత్నాకర్‌రావు తెలిపారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం ఆయన ఒక ప్రటకన విడుదల చేశారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో సమావేశం మందిరంలో ఎంపీడీవో ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ సమావేశానికి మండల స్థాయి లోని అన్ని రాజకీయ పార్టీల అధ్యక్ష, కార్యదర్శులు హాజరుకావాలని ఆయన కోరారు.

ఇసుకకు టెండర్





స్వర్ణవాగు ఒడ్డు నుంచి ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తున్న దృశ్యం

- జిల్లాలో రెచ్చి పోతున్న గ్రామాభివృద్ధి కమిటీలు
- స్వర్ణ వాగు అడ్డాగా భారీగా ఇసుక దందా
- ప్రతీరోజు లక్షల రూపాయల్లో లావాదేవీలు
- కొత్త కొత్త పద్ధతుల్లో ఇసుక తవ్వకాలు
- చోద్యం చూస్తున్న అధికారులు

నిర్మల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని స్వర్ణవాగు పరివాహక ప్రాంతం మొత్తం ఆయా గ్రామాల వీడీసీ(గ్రామాభివృద్ధి కమిటీ)ల చేతుల్లోకి వెళ్లిపోయింది. ఇప్పటికే జిల్లాలోని చాలా గ్రామాల్లో సమాంతర వ్యవస్థను నడిపిస్తూ అన్నీ తామై శాసిస్తున్న వీడీసీలు కీలకమైన ఇసుక దందాను తమ గుప్పిట్లోకి తీసుకున్నాయి. స్వర్ణప్రాజెక్టు మొద లుకొని సోన్ సమీపంలోని గోదావరి నది వరకు గల వాగు లోని ఇసుకను వీడీసీలు ప్రధాన వనరుగా మలుచుకున్నాయి. ఇందులో భాగంగానే స్వర్ణవాగు పరివాహకమైన మలక్ చించోలి నుంచి మొదలుకొని బోరిగాం, ఆలూర్, యాకర్‌పెల్లి, కాలువ, బీరవెల్లి, వంజర్, గోడిసెర, వెంగ్వాపేట్, చిట్యాల, సిద్దాపూర్, కౌట్ల, సిద్దిలకుంట, జాఫ్రాపూర్, మాధాపూర్ తదితర గ్రామాల్లో వీడీసీలు అక్కడి వాగులపై గుత్తాధిపత్యం చెలాయిస్తున్నాయి. ప్రభుత్వ యంత్రాంగాన్ని పక్కన పెట్టి వీడీసీలు అన్నీ తామై ముందుకు సాగుతున్నాయంటున్నారు. అయితే ఆయా గ్రామాల్లోని వీడీసీలు తమ పరిధిలోని వాగు పరివాహక ప్రాంతానికి సంబంధించి ఇసుక కోసం బహిరంగంగా టెండర్‌లు నిర్వహించి టెండర్‌బార్‌ల నుంచి లక్షల రూపాయలు వసూలు చేస్తున్నాయి. ఇక్కడ నాణ్యమైన ఇసుక లభిస్తున్న కారణంగా చాలా మంది ఇసుక వ్యాపారులు ఇక్కడి ఇసుకను దక్కించుకునేందుకు పెద్దమొత్తంలో చెల్లిస్తూ పోటాపోటీగా టెండర్‌లను దక్కించుకున్నట్లు చెబుతున్నారు. దీని కారణంగా వీడీసీలకు లక్షల రూపాయల్లో ఆదాయం సమకూరుతోంది. అయితే వీడీసీలు బహిరంగంగా వేలం పాటలు నిర్వహిస్తూ ఇసుకను అక్రమంగా తరలించుకు వెళ్ళేందుకు అనుమతినివ్వడమే కాకుండా అంతాతామై వ్యవహరిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు మాత్రం చోద్యం చూస్తుండడం పట్ల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాజకీయంగా పలుకుబడి గల వీడీసీలు ఇలా అక్రమ ఇసుక దందాకు అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ వీడీసీల వెనక కొంత మంది రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు అండగా ఉన్నట్లు కూడా ఆరోపణలు వస్తున్నాయి. రాజకీయ నేతల అండదండలు అధికారుల ఉదాసీన వైఖరి కారణంగా వీడీసీలు అక్రమ ఇసుక తవ్వకాలకు, తరలింపుకు అనధికారిక అనుమతులు ఇస్తూ సమాంతర వ్యవస్థకు సాక్ష్యంగా నిలుస్తున్నాయని అంటున్నారు.

అంతా వీడీసీలదే రాజ్యం

కాగా జిల్లాలో వీడీసీలదే రాజ్యం నడుస్తోందని అంటున్నారు. వీడీసీల గుప్పిట్లోనే ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీల నేతలు ఉంటున్న కారణంగా వారు చెప్పిందే వేదంగా కొనసాగుతుందని చెబుతున్నారు. వారి ఆదేశాలు లేనిదే గ్రామంలో ఎలాంటి కార్యకలాపాలు ముందుకు సాగడం లేదని అంటున్నారు. వీడీసీలు గీత గీస్తే ఆ గీతను దాటేందుకు ఎవరూ సాహసించడం లేదని చెబుతున్నారు. ఇప్పటికే గ్రామాల్లో బెల్ట్‌షాపులు, కల్లు దుకాణాలు, కూల్‌డ్రింగ్ షాపులాంటి వాటన్నింటికీ వేలం పాటలు నిర్వహిస్తూ లక్షల రూపాయలు సమకూర్చుకుంటున్న వీడీసీలు ఇక తమ గ్రామాల్లోని వాగులు, వంకలను లక్ష్యంగా చేసుకుంటున్నాయని అంటున్నారు. వాగుల్లోని ఇసుకను ప్రధాన ఆదాయ వనరుగా మలుచుకుంటూ తద్వారా లక్షల రూపాయల్లో సొమ్ము చేసుకోవాలని వీడీసీలు భావిస్తున్నాయి. దీనికి అనుగుణంగానే ఇసుక రీచులకు పెద్దమొత్తంలో అనధికారిక టెండర్‌లు నిర్వహించి పెద్దమొత్తంలో చెల్లించిన వారికి ఆ ఇసుక రీచులను కట్టబెడుతున్నాయి. దీంతో లక్షల రూపాయల సొమ్మును వీడీసీలు కూడగడుతున్నాయన్న ఆరోపణలున్నాయి. దీంతో పాటు గ్రామాల్లో వీడీసీలు ఇచ్చే తీర్పులకు ఎవరు ఎదురు తిరిగినా వారికి కుల లేదా సామాజిక బహిష్కరణలు విధించి నిర్బంధ పోకడలను అమలు చేస్తున్నాయని అంటున్నారు. ఇప్పటికే చాలా గ్రామాల్లో వీడీసీల ఆగడాలపై పలువురు బాధితులు ఫిర్యాదులు చేయడమే కాకుండా ఆందోళనలు సైతం చేపట్టిన సంగతి తెలిసిందే. ఇలా సమాంతర వ్యవస్థను నడుపుతున్న వీడీసీల ఆగడాలకు అధికారులు సైతం కళ్లెం వేయలేని దుస్థితి నెలకొందని అంటున్నారు.

కొత్త కొత్త పద్ధతుల్లో ఇసుక తవ్వకాలు

కాగా స్వర్ణవాగులో ప్రస్తుతం నీటిప్రవాహం కొనసాగుతున్న కారణంగా ఇసుక వ్యాపారులు ఆవాగు నుంచి ఇసుకను తవ్వేందుకు సరికొత్త మార్గాలను అనుసరిస్తున్నారంటున్నారు. ముఖ్యంగా వాగులో నీరు ఉన్నప్పటికి మట్టిని తీసే విధానాన్ని వీరు అమలు చేస్తున్నారు. నీటి నుంచి మట్టిని తీసే యంత్రాలను తెప్పించి వాటి ద్వారా వాగుల నుంచి ఇసుకను తవ్వుతూ ట్రాక్టర్‌లు, టిప్పర్‌ల ద్వారా తరలిస్తున్నారు. ఇలా స్వర్ణప్రాజెక్టు నుంచి ప్రస్తుతం పరివాహకంలోని మాధాపూర్ వరకు తవ్వకాలు సాగిస్తున్నారన్న ఫిర్యాదులున్నాయి. ప్రొక్లెయినర్స్‌తో పాటు జేసీబీ యంత్రాలు అలాగే వాగుల నుంచి మట్టిని తీసే యంత్రాలను ఇసుక టెండర్‌లు దక్కించుకున్న వారు ఇతర ప్రాంతాల నుంచి అద్దెకు తీసుకువస్తూ యథేచ్ఛగా తవ్వకాల దందాను కొనసాగిస్తున్నారని చెబుతున్నారు.

స్వర్ణవాగు పరివాహకమే లక్ష్యంగా..

కాగా స్వర్ణప్రాజెక్టు నుంచి గోదావరి నది వరకు గల వాగు పరివాహకాన్ని వీడీసీలు లక్ష్యంగా చేసుకుంటున్నాయన్న ఆరోపణలున్నాయి. ఈ పరివాహకంలో ప్రతీఏటా పెద్దఎత్తున ఇసుక అందుబాటులోకి వస్తున్న కారణంగా వీడీసీలు ఇటువైపు దృష్టి సారించాయి. అలాగే జిల్లాలో ఇసుకకు భారీ డిమాండ్ ఉన్న కారణంగా ఈ వాగు నుంచి ఇసుకను తరలించేందుకు చాలా మంది వ్యాపారులు పోటీ పడుతుంటారు. దీని కారణంగా వీడీసీలు తమ పరిధిలో ఉన్న వాగుల్లోని ఇసుకను అక్రమ పద్దతుల్లో తరలించేందుకు సిద్ధమవుతున్నాయి. దీనికి అనుగుణంగా ఇప్పటికే గ్రామాల్లో అన్నీ తామై వ్యవహరిస్తున్న వీడీసీలు కొంతమంది వ్యాపారులకు తమ పరిధిలోని వాగులను గంపగుత్తగా అప్పగిస్తున్నాయి. ఈ వాగుల నుంచి ఇసుకను తవ్వి తరలించుకునేందు కోసం బహిరంగంగా వేలం పాటలు నిర్వహిస్తున్నాయి. ఈ వేలం పాటలో ఇసుక తవ్వకాలను దక్కించుకున్న వారు రాత్రింబవళ్లు గ్రామాల నుంచి ఇసుకను అడ్డగోలుగా తరలించుకువెళుతున్నారు. అయితే ఈ ఇసుకను తరలించేందు వస్తున్న భారీ వాహనాల కారణంగా గ్రామాల్లోని రోడ్లన్నీ గుంతలుగా మారి అధ్వాన్నంగా తయారవుతున్నాయంటున్నారు. దీంతో పాటు తరుచూ ప్రమాదాలు సైతం జరుగుతున్నాయి. అయినప్పటికి ఇసుక తరలింపు వ్యవహారం మాత్రం ఆగడం లేదంటున్నారు. ప్రస్తుతం స్వర్ణవాగు పరివాహకం ఇసుక వ్యాపారులకు,వీడీసీలకు వరప్రసాదినిగా మారిందంటున్నారు.





చిట్యాల సమీపంలోని స్వర్ణవాగు నుంచి ప్రొక్లెయినర్‌ల సహాయంతో ఇసుకను తవ్వుతున్న దృశ్యం

ఖానాపూర్, ముథోల్ ప్రాంతాల్లో

వ్యాపారులపై అధికారుల కొరడా

- నిబంధనలు పాటించని వ్యాపారస్థులకు రూ. 4.20 లక్షల జరిమానా

ఖానాపూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలు పాటించని వ్యాపారస్థులపై జిల్లా అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్ కొరడా ఝులిపించారు. గత కొన్ని రోజులుగా జిల్లాలోని నిర్మల్, ఖానాపూర్, ముథోల్ ప్రాంతాల్లో నిర్వహించిన విస్తృత తనిఖీల్లో నిబంధనలు పాటించని వ్యాపారస్తులకు జిల్లా అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ భారీ జరిమానాలు విధించినట్లు నిర్మల్ జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి ప్రత్యూష తెలిపారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా ఆయా వ్యాపార నిర్వాహకులకు మొత్తం రూ. 4.20 లక్షల జరిమానాలను విధించినట్లు తెలిపారు. ఖానాపూర్ పట్టణంలో అక్రమంగా గుట్కా విక్రయిస్తున్నందుకు ఆహార పదార్థాలు లేబులింగ్ సరిగా లేనందుకు గాను రాందేవ్ జనరల్స్ దుకాణానికి రూ. 1.50 లక్షల జరిమానాలను, రుద్రాన్స్ మిఠాయిల దుకాణానికి ఆహార పదార్థాల విక్రయ లైసెన్స్ లేకుండా ఆహార పదార్థాలు అమ్మినందుకు గాను, గడువు తీరిన ఆహార పదార్థాలు విక్రయిస్తున్నందుకు రూ. 2 లక్షల జరిమానా విధించినట్లు ఆమె పేర్కొన్నారు. పురుగు పట్టిన కందిపప్పు విక్రయిస్తున్నందుగాను ముథోల్ బాలాజీ కిరాణా దుకాణానికి రూ.70 వేల జరిమానాలను విధించినట్లు పేర్కొన్నారు. నిబంధనలను పాటించని వ్యాపారుల పట్ల కఠినచర్యలు ఉంటాయని ఈ సందర్భంగా ఆమె హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా ఫుడ్ సేఫ్టీ అధికారుల బృందం తనిఖీలు నిరంతరంగా కొనసాగుతాయన్నారు.

పెన్షన్ ఇప్పిస్తానంటూ మస్కా

- వృద్ధుడి నుంచి రూ.19 వేల ఆపహరణ

భైంసా, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పెన్షన్ ఇప్పిస్తానంటూ ఆగంతకుడొకరు వృద్ధుడికి మస్కా కొట్టి రూ.19 వేలు అపహరించుకుపోయిన ఘటన సోమవారం భైంసాలో చోటు చేసుకుంది. కుభీర్ మండలంలోని మాలేగాం గ్రామానికి చెందిన ఎండ్ల గంగాధర్ (60)అనే వృద్ధుడు సోమవారం ఉదయం ఇక్కడి బస్టాండ్ సమీపంలోని ఎస్‌బీఐ బ్యాంక్ నుంచి రూ.30 వేలు విత్ డ్రా చేసుకొని బయటకు వచ్చాడు. ఇదే సమయంలో గుర్తు తెలియని ఆగంతుడొకరు వృద్ధుని వద్దకు వచ్చి తాతా నెలకు రూ.28 వేల పెన్షన్ ఇప్పిస్తానంటూ పలకరించి మాటమాట కలిపి నమ్మబలికాడు. అనంతరం వృద్ధుడిని బస్టాండ్ ముందరి భాగంలోని ఏరియా ఆసుపత్రి తీసుకవచ్చాడు. అక్కడ వృద్ధుని వద్ద నుంచి రూ.19 వేలు తీసుకొని పెన్షన్ మంజూరి పత్రం పై అధికారుల సంతకం తీసుకవస్తానని చెప్పి ఆసుపత్రి లోపలికి వెళ్లి అక్కడి నుంచి అటే ఉడాయించాడు. సంతకం కోసం వెళ్లిన అగంతకుడి కోసం గంటల తరబడి ఎదురు చూసిన వృద్ధుడు మోసపోయినట్లుగా గుర్తించి సంబంధిత విషయాన్ని టౌన్ పోలీసుల దృష్టికి తీసుకవెళ్లారు. దీంతో పట్టణ పోలీసులు ఆగంతుడిని గుర్తించి పట్టుకునేందుకు గాను చర్యలు చేపట్టారు.

'మాలల సింహ గర్జన సభను విజయవంతం చేయండి'

లక్ష్మణచాంద, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్ (జింఖానాగ్రౌండ్)లో డిసెంబరు 1న మధ్యాహ్నం 12 గంటలకు జరుగబోయే 'మాలల సింహగర్జన' సభను విజయవంతం చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా కన్వీనర్ బత్తుల రంజిత్ కోరారు. మండలంలోని చింతల్ చందాలో సోమవారం జరిగిన మాలల చైతన్య సదస్సుకు హాజరయ్యారు. సభ నిర్వహణకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా రంజిత్‌తో పాటు కోకన్వీనర్లు కుంటోల్ల వెంకటస్వామి, వెల్మల రాజేశ్వర్, పురుషోత్తం తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో చింతల్‌చందాలోని మాల సంఘ సభ్యులంతా పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను కళాజాత కార్యక్రమం ద్వారా ప్రచారం

లక్ష్మణచాంద, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలను కళాజాత కార్యక్రమం ద్వారా మండల కేంద్రంలో సోమవారం ప్రచారం చేశారు. ప్రజా పాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా పాటలు, మ్యాజిక్, ఆటల ద్వారా పలు పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు అట్ల రాంరెడ్డి, కళాజాత బృందం ఉన్నారు.

జిల్లా కేంద్రానికి ఉత్తరాఖండ్ నుంచి స్వామీజీల రాక

నిర్మల్ కల్చరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాఖండ్ హరిద్వార్ ధర్మానందగిరికి చెందిన సోలానందగిరి, విశ్వనందగిరి స్వామీజీలు సోమవారం నిర్మల్‌కు చేరుకున్నారు. వారిని పాకాల రాంచందర్ నివాసానికి ఆహ్వానించి సన్మానించారు. ఆశీర్వచనాలు తీసుకున్నారు.

సకాలంలో రైతులకు చెల్లింపులు జరగాలి

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయండి : కలెక్టర్ అభిలాష అభినవ్

సోన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్మల్ గ్రామీణ మండలం రత్నాపూర్ కాండ్లీ గ్రామ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్‌తో కలిసి ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలను కల్పించాలన్నారు. రైతుల నుంచి ధాన్యాన్ని సేకరించిన వెంటనే ట్యాబ్ ఎంట్రీ ప్రక్రియను పూర్తి చేసి, ధాన్యానికి సంబంధించిన రసీదును ఇవ్వాలన్నారు. కొనుగోలు కేంద్రంలో నిర్వహిస్తున్న రిజిస్టర్లను తనిఖీ చేసి పలు కీలక సూచనలు చేశారు. అన్ని రకాల రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలన్నారు. కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చిన వెంటనే రైతుల నుంచి వారి ఖాతాల్లో డబ్బులు జమ చేసేందుకు గాను వారి ఆధార్, బ్యాంక్ పాస్ పుస్తకాల జిరాక్స్ కాపీలను తీసుకోవాలన్నారు. సకాలంలో రైతులకు బిల్లుల చెల్లింపులు జరగాలని సూచించారు. ప్రభుత్వ నిబంధన మేరకు మాత్రమే ధాన్యం తూకం వేయాలన్నారు. అవసరమైన గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్యాడి క్లీనింగ్ యంత్రాల ద్వారా వరి ధాన్యాన్ని శుభ్రపరచడం ద్వారా తరుగు రూపంలో నష్టం రాదని కలెక్టర్ రైతులకు సూచించారు. కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఏవైనా సందేహాలు, ఫిర్యాదులు ఉన్నట్లయితే సహాయ కేంద్రానికి ఫోన్ ద్వారా సంప్రదించవచ్చునన్నారు. ధాన్యపు లారీలను వెంట వెంటనే గోదాములకు తరలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌వో కిరణ్ కుమార్, డీఎం వేణుగోపాల్, డీసీవో రాజమల్లు, తహసీల్దార్ సంతోష్, ఎంపీడీవో గజానంద్, అధికారులు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.



తేమ శాతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

గల్ఫ్ బాధితుడికి అండగా ఉంటామని హామీ ఇచ్చిన కలెక్టర్


నిర్మల్ అర్బన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కొద్దిరోజుల క్రితం ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశం కువైట్‌కు వెళ్లి తన విధి నిర్వహణలో భాగంగా ఎడారిలో ఒంటెలు కాస్తూ, అనుకోకుండా సరిహద్దు దాటి సౌదీ అరేబియా దేశంలోకి అడుగుపెట్టి కష్టాల్లో చిక్కుకొని కలెక్టర్ చొరవతో సురక్షితంగా స్వదేశానికి తిరిగి వచ్చిన జిల్లాకు చెందిన ముథోల్ మండలం రువ్వి గ్రామస్తుడు రాథోడ్ నాందేవ్ సోమవారం జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో తన కుటుంబంతో కలిసి కలెక్టర్‌కు, జిల్లా అధికార యంత్రానికిగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాందేవ్ మాట్లాడుతూ... తాను కష్టాల్లో చిక్కుకున్నట్లు సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకొని సురక్షితంగా ఇంటికి చేరుకోవడానికి సహాయం చేసిన కలెక్టర్‌కు కుటుంబ సభ్యులతో కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా తనకు ఉపాధి కల్పించాలని కలెక్టర్‌కు విన్నవించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. రాథోడ్ నాందేవ్ సురక్షితంగా తిరిగి రావడం చాలా సంతోషకరమైన విషయమని తెలిపారు. తాను కష్టాల్లో ఉన్న విషయం తెలుసుకున్న వెంటనే ఆ విషయాన్ని కేంద్ర విదేశాంగశాఖకు, రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేయగానే వెంటనే స్పందించి అవసరమైన సహాయ సహకారాలను అందించడం ద్వారా యుద్ధ ప్రాతిపదికన గల్ఫ్ బాధితుడిని సురక్షితంగా కాపాడి స్వదేశానికి తీసుకురావడం జరిగిందని తెలిపారు. గల్ఫ్ బాధితుడికి స్వయం ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర విదేశాంగ శాఖకు, రాష్ట్ర ప్రభుత్వానికి, జిల్లా అధికార యంత్రాంగానికి కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. గల్ఫ్ దేశాలకు వెళ్లాలనుకున్న వారు అనధికార ఏజెంట్లను నమ్మి మోసపోవద్దని సూచించారు. ప్రభుత్వం గుర్తించిన ఏజెంట్ల ద్వారానే గల్ఫ్ దేశాలకు వెళ్లాలని తెలిపారు. ఈ కార్య క్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్‌కుమార్, ప్రవాసి మిత్ర లేబర్ యూనియన్ ప్రెసిడెంట్ స్వదేశ్ పరికి పండ్ల, జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలి

ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి కలెక్టర్ దరఖాస్తులను స్వీకరించారు. విద్య, వైద్యం, వ్యవసాయం, పింఛన్లు, ధరణి, భూ సమస్యలు, రెండు పడక గదుల ఇళ్ల వంటి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు తమ అర్జీలను సమర్పించారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజావాణి దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. శాఖల వారీగా ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, సీఎం ప్రజావాణి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. సంబంధిత అధికారులంతా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేటట్లు చూడాలన్నారు. ఇప్పటికే జిల్లాలో దాదాపు 95 శాతానికి పైగా సమగ్ర ఇంటింటి సర్వే పూర్తి చేసినట్లు తెలిపారు. సర్వే వివరాల డాటా ఆన్‌లైన్ నమోదు కార్యక్రమం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్‌అహ్మద్, కిషోర్ కుమార్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మహిళాశక్తి క్యాంటీన్లు సాధికారతకు తోడ్పడతాయి

జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



క్యాంటీన్‌ను పరిశీలిస్తున్న జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

నిర్మల్ అర్బన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మహిళాశక్తి క్యాంటీన్లు మహిళల సాధికారతకు ఎంతగానో తోడ్పడతాయని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ తెలిపారు. సోమవారం పట్టణంలోని వైద్య కళాశాలలో మహిళా శక్తి క్యాంటీన్‌ను అదనపు కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మహిళా స్వయం సంఘాలకు మహిళా శక్తి క్యాంటీన్లు ఆర్థికంగా బలపడడానికి తోడ్పడతాయన్నారు. ఈ మహిళాశక్తి క్యాంటీన్ ద్వారా వైద్య విద్యార్థులకు పరిశుభ్రతతో కూడిన నాణ్యమైన ఆహారాన్ని అందించాలని తెలిపారు. అనంతరం వైద్య విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందితో మాట్లాడుతూ... కళాశాలలో ఏర్పాటు చేసిన మహిళా శక్తి క్యాంటీన్ వినియోగించుకొని మహిళా సాధికారితకు చేయూతనివ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్‌గోపాల్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, మెప్మా పీడీ సుభాష్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రెండు దేవాలయాల్లో దొంగతనం

నిర్మల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : లోకేశ్వరం మండల కేంద్రంలోని పెద్దమ్మగుడి, వీర బ్రహ్మేంద్రస్వామి, శివాలయంలో దాదాపు 10 గ్రాముల బంగారం, 15 గ్రాముల వెండి ఆభరణాలు ఆదివారం రాత్రి దొంగతనం జరిగినట్లు పెద్దమ్మగుడి చైర్మన్ గంగాధర్ లోకేశ్వరం ఎస్సై అశోక్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సై కేసు నమోదు చేసి క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ ద్వారా దర్యాప్తు ప్రారంభిస్తున్నా మన్నారు. ఈ సందర్భంగా ఎస్సై అశోక్ మాట్లాడుతూ... దొంగతనానికి పాల్పడిన వారిని త్వరలోనే పట్టుకుంటామన్నారు. వారి నుంచి దేవుడి బంగారం, వెండి వస్తువులను స్వాధీనం చేసుకుంటామన్నారు.

సంక్షిప్త సమాచారం

పెరిగిన చలితీవ్రత

నిర్మల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో జనం చలితీవ్రతతో గజగజ వణికిపోతున్నారు. సోమవారం జిల్లాలో 14 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లాలో పలు చోట్ల ఉదయం 8 గంటల వరకు సైతం మంచు తెరలు కమ్ముకుని ఉన్నాయి. దీంతో చలి తీవ్రంగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. చలి తీవ్రత పెరుగుతుండడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో జనం చలి మంటలు వేసుకుని ఉపశమనం పొందుతున్నారు.

విద్యుత్‌శాఖ

నూతన ఎస్ఈగా బి. సుదర్శనం

నిర్మల్ కల్చరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లా విద్యుత్ శాఖ నూతన సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా బి.సుదర్శనం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. యూనియన్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

కళాకారులకు ప్రోత్సాహకాలు అందించాలి

ఆదివాసీ కళాకారులకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందించాలని కోరుతూ సోమవారం ఆదివాసి సంఘం నాయకులు ఉట్నూర్‌లో ఐటీడీఏ పీవోకు వినతి పత్రాన్ని అందజేశారు. నాయకులు తొడసం శంభు, భీమ్ రావు, సూర్యభాను, ఆనంద్‌రావు, రాములు, తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ సందర్భంగా ప్రతిభా పురస్కారాలు

నిర్మల్ కల్చరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : క్రిస్మస్ సందర్భంగా పలు రంగాల్లో ప్రతిభావంతులైన వ్యక్తులకు, సంస్థలకు ప్రభుత్వం పురస్కారాలు అందించనున్నట్టు జిల్లా మైనారిటీ అధికారి మోహన్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. సామాజిక సేవ, వైద్య, విద్యా, సాహిత్య తదితర రంగాల్లో ఈ అవార్డులను అందజేస్తారన్నారు. నామినేషన్ ఫారాలు వెబ్‌సైట్ నుంచి డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. డిసెంబరు 5లోగా సమర్పించాలన్నారు. వివరాలకు 040 23391067 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నిరసన ర్యాలీలు జయప్రదం చేయండి

కేంద్రప్రభుత్వం కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ మంగళవారం నిర్వహించే నిరసన ర్యాలీలు జయప్రదం చేయాలని టీయూసీఐ రాష్ట్ర కార్యదర్శి కే. రాజన్న పిలుపునిచ్చారు. ట్రేడ్ యూనియన్, కిసాన్‌మోర్చా సంయుక్తంగా దేశవ్యాప్త నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చినట్టు తెలిపారు. సోమవారం నిర్మల్‌లో కరపత్రాలు విడుదల చేశారు. గంగామణి, కమల, తస్లీన్, కవిత, తదితర నాయకులు పాల్గొన్నారు.

వీధి కుక్కల బెడదను అరికట్టండి

నిర్మల్ పట్టణంలోని పలు వార్డుల్లో వీధి కుక్కలను నివారించాలని ఎంఐఎం నాయకులు సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కౌన్సిలర్ ముజాహిద్‌అలీ, నాయకులు రఫీక్‌అహ్మద్, తదితరులు కోతులతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.

తైక్వాండో స్టేట్ కో ఆర్డినేటర్‌గా అక్షయ్

నిర్మల్ కల్చరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రానికి చెందిన దయత్ అక్షయ్ తెలంగాణ రాష్ట్ర తైక్వాండో కోఆర్డినేటర్‌గా నియమితులయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో స్పోర్ట్స్ అథారిటీ అక్షయ్‌ను నియమించింది.